క్లుప్తంగా

ఉత్సాహంగా వృక్షాబంధన్



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

దుబ్బాకటౌన్: మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని లచ్చపేట మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బుచ్చిబాబు అన్నారు. సీసీఆర్టీ కల్చరల్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం లచ్చపేట ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన వృక్షాబంధన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జూన్, జూలై నెలల్లో పుట్టినరోజు జరుపుకున్న విద్యార్థులు తమతమ పుట్టినరోజు సందర్భంగా ఉద్యానవనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీసీఆర్టీ క్లబ్ కన్వీనర్ రాదారి నాగరాజు ఆధ్వర్యంలో వృక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. గార్డెన్ ఏర్పాటుతో విద్యార్థులలో పర్యావరణంపై ప్రేమ, మొక్కల పెంపకంపై అవగాహన కలుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మదన్ మోహన్, నరేశ్ తదితరులున్నారు.

వేడుకగా ఫ్రెషర్స్‌డే



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

నంగునూరు(సిద్దిపేట): కళాశాలలో కొత్తగా చేరే విద్యార్థులతో స్నేహపూర్వకంగా ఉండాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జానయ్య సూచించారు. అక్కెనపల్లి ఆదర్శ పాఠశాలలో గురువారం ఫెషర్స్‌డే ఉత్సాహంగా నిర్వహించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరిన విద్యార్థులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆట, పాటలు, నృత్యాలతో విద్యార్థులు అలరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాస్, పవన్‌కుమార్, రజని, నర్సయ్య, రవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓటే.. వజ్రాయుధం



ఉపాధ్యాయులతో ఎస్‌ఐ రాజేశ్ తదితరులు

సిద్దిపేటరూరల్: రాజ్యాంగం అందించిన ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని రూరల్ ఎస్‌ఐ రాజేశ్ అన్నారు. మండల పరిధిలోని చిన్నగుండవెల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం మాక్ పోలింగ్ నిర్వహించి ఓటింగ్ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటుకు ఉన్న ప్రాధాన్యాన్ని వివరించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ పరమేశ్వరి, ఎంపీడీఓ మురళీధర్‌శర్మ, ప్రధానోపాధ్యాయులు రవీందర్, అరుణ, శివకుమార్, రేణుక, శ్రీనివాసరావు, మంజుల తదితరులు పాల్గొన్నారు.

తీజ్ వేడుకల సందడి



తీజ్ పండుగ నిర్వహిస్తున్న గిరిజనులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని పంతుల్‌తండాలో గిరిజనులు గురువారం తీజ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గోధుమలను తొమ్మిది రోజులు బుట్టలో నానబెట్టి, బుట్ట వద్ద ప్రతి రోజు సాయంత్రం పూజలు నిర్వహించి సంతోషంగా నృత్యాలు చేశారు. తొమ్మిదో రోజు పూర్తయ్యే నాటికి మొలకల్లో కొన్నింటిని గిరిజన పెద్దల తలపాగాల్లో వేసి మిగిలినవాటిని సమీపంలోని చెరువులో వదిలారు. అనంతరం బుట్టలను తెచ్చిన యువతుల కాళ్లను వాళ్ల సోదరులు కడిగి ఆశీస్సులు తీసుకున్నారు.

ముందస్తు జాగ్రత్తలు అవసరం



రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మిరుదొడ్డి(దుబ్బాక): సీజన్ వ్యాధులు రాకుండా ప్రతి ఒక్కరు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ఐకేపీ ఏపీఎం లక్ష్మీనర్సమ్మ కోరారు. మిరుదొడ్డిలో వివిధ మహిళా సంఘాల సభ్యులకు గురువారం రక్తపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సంఘాల్లో ఉన్న ప్రతి సభ్యురాలు ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం విధిగా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నదన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోరారు. పీహెచ్‌సీ డాక్టర్ సమీనా సుల్తానా, సీహెచ్‌ఓ లింగమూర్తి, సీసీ వైకుంఠం, ఐకేపీ వీఓఏలు సుమలత, లక్ష్మి, గంగమ్మ, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఇళ్ల నిర్మాణాలు

మండల పరిధిలో 451 మంజూరు



రాంపూర్‌లో స్లాబ్ పూర్తయిన ఇల్లు

- పైలెట్ ప్రాజెక్టుగా రాంపూర్
- 53 ఇళ్లు మంజూరు, పురోగతిలో 23
- 27 నిర్మాణాలకు బిల్లులు చెల్లింపు

చేర్యాల(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం పేదల సొంతింటి కల నెరవేర్చాలన్న లక్ష్యంతో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు మండల పరిధిలో జోరుగా సాగుతున్నాయి. మొత్తం 20 గ్రామ పంచాయతీల పరిధిలో 451 ఇళ్లు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన మంజూరు పత్రాలను కలెక్టర్ హైమావతి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. నిర్మాణ పనులు కూడా ప్రారంభింపజేశారు. జిల్లా, మండల, గ్రామ స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పనులు పరిశీలిస్తున్నారు.

పైలెట్ ప్రాజెక్టుగా రాంపూర్

మండల కేంద్రానికి సమీపంలో ఉన్న రాంపూర్ జనాభా సుమారు వెయ్యి మంది. తక్కువ జనాభా ఉన్న చిన్న గ్రామం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి ఈ గ్రామం నుంచే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభించింది.

మంజూరైన ఇళ్లు 53

పైలెట్ గ్రామం కింద ఎంపిక చేసిన రాంపూర్‌లో 53 కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేశారు. మంజూరైన లబ్ధిదారులు తమ ఇళ్లను వేగంగా నిర్మించుకోవాలని అధికారులు అవగాహన కల్పించారు.



చిట్యాలలో పిల్లర్ల దశలో పనులు

అయినప్పటికీ కొందరు ముందుకు రాకపోవడంతో 23 మందికి సంబంధించిన నిర్మాణ పనులను అధికారులు ప్రారంభించారు. పనులు కొనసాగుతున్నాయి. అందులో ఐదు ఇళ్లు స్లాబ్ లెవల్ వరకు పూర్తయ్యాయి. మిగిలిన వారి పనులను కూడా అధికారులు పర్యవేక్షిస్తూ అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తున్నారు. నిబంధనలకు లోబడి నిర్మాణం జరుగుతున్న 27 ఇళ్లకు సంబంధించిన బిల్లులు కూడా జమ చేశారు.

అధికారుల ప్రోత్సాహం

కొన్ని ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నప్పటికీ మరికొంత మంది మాత్రం వివిధ కారణాలతో పనులు ప్రారంభించలేదు. సంబంధిత అధికారులు అలాంటి వారితో మాట్లాడి ఇళ్లు నిర్మించుకునేలా ఒప్పిస్తున్నారు. లేకపోతే వారి అనుమతితో లబ్ధిదారుల జాబితా నుంచి వారి పేర్లు తొలగిస్తున్నారు. దీంతో పాటు ఆర్థికంగా లేని వారికి మహిళ సంఘాల నుంచి రూ.లక్ష వడ్డీ లేని రుణం తీసుకోవచ్చని కూడా సూచిస్తున్నారు.

కల నెరవేరింది



గత ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేస్తుందని కలగన్నాం. నేడు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రాగానే ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా మాకు ఇల్లు మంజూరు కావడంతో మా కల నెరవేరింది. ఇంటి నిర్మాణం ప్రారంభించాం. పనులు స్లాబ్ లెవల్ వరకు పూర్తయ్యాయి. ప్రభుత్వ సాయంతో ఇల్లు నిర్మించుకుంటున్నాం.

– చిలుక లత, రాంపూర్

ఆనందంగా ఉంది..



సొంతిల్లు నిర్మించుకోవాలని ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న మా కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడం ఆనందంగా ఉంది. కుటుంబం అంతా సంతోషంగా పనుల్లో పాల్గొంటున్నాం. వీలైనంత త్వరగా నిర్మాణం పూర్తి చేసుకొంటాం.

– లక్ష్మి, చిట్యాల

లబ్ధిదారులతో మాట్లాడుతున్నాం



మండల వ్యాప్తంగా మంజూరైన ఇళ్లలో కొన్నింటికి నిర్మాణ పనులు ఇంకా ప్రారంభం కాలేదు. ఆ లబ్ధిదారులను నేరుగా కలిసి మాట్లాడుతున్నాం. కారణాలు తెలుసుకుని పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నాం. మంజూరైన ఇళ్లు వందశాతం పూర్తి చేయించడానికి కలెక్టర్ ఆదేశాలతో కృషి చేస్తున్నాం.

– మహబూబ్ అలీ, ఎంపీడీఓ, చేర్యాల



రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ హైమావతి

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

- జిల్లా కలెక్టర్ హైమావతి

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ప్రభుత్వాస్పత్రికి వచ్చే వారితో గౌరవంగా వ్యవహరించాలని కలెక్టర్ హైమావతి సూచించారు. మండల పరిధిలోని ఇబ్రహీం నగర్ పీహెచ్‌సీని గురువారం ఆమె సందర్శించారు. ఆస్పత్రికి వైద్యం కోసం వచ్చిన వారితో మాట్లాడారు. వారికి అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని, మెరుగైన సేవలందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పురోగతిని పరిశీలించారు. త్వరితగతిన నిర్మాణం పూర్తి చేసుకొని సొంతింటి కల నేరవేర్చుకోవాలని లబ్ధిదారులకు సూచించారు.

డైట్ మెనూ తప్పనిసరి

సిద్దిపేటఅర్బన్: పాఠశాలల్లో ప్రభుత్వం సూచించిన విధంగా డైట్ మెనూను తప్పనిసరిగా పాటించాలని, విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించాలని కలెక్టర్ కె.హైమావతి ఆదేశించారు. అర్బన్ మండలం బక్రిచెప్యాలలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు తీరును ఆమె పరిశీలించారు. వంటశాల, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

సస్యరక్షణ చేపడితే అధిక దిగుబడి

శాస్త్రవేత్త డా. పల్లవి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

తొగుట(దుబ్బాక): పత్తిసాగులో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, తోర్నాల శాస్త్రవేత్త డా.సీహెచ్ పల్లవి తెలిపారు. బాబూజగ్జీవన్‌రామ్ వ్యవసాయ కళాశాల సిరిసిల్ల వ్యవసాయ విభాగం విద్యార్థినులకు గురువారం క్షేత్రస్థాయి అవగాహన కల్పించారు. అందులో భాగంగా మండల పరిధిలోని గుడికందులలో రైతు బీరయ్యకు చెందిన పత్తి పంటను పరిశీలించారు. రసం పీల్చే పురుగుల నివారణ గురించి విద్యార్థినులకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పత్తి విత్తిన 60 రోజుల్లో రసం పీల్చే పురుగులతో పాటు, పేను బంక, తామర పురుగులు, పచ్చ దోమలు ఆశించి నష్టపరుస్తాయన్నారు. దీంతో పంట 12 శాతం దిగుబడి తగ్గే అవకాశం ఉందని చెప్పారు. వాటి నివారణ కోసం కాండానికి మందు పూత పద్ధతే కాకుండా, తొలిదశలో 5 శాతం వేప కషాయం లేదా, లీటర్ నీటికి 5.0 మి. లీ.(1500పీపీఎం) వేప నూనెను 1మి. లీ. శాండోవిట్ లాంటి జిగురు మందుతో కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. తొలిదశలో వాటి ఉనికిని గుర్తించి అధికారుల సలహాలు, సూచనలతో సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి ఫలితాలు ఉంటాయని చెప్పారు.

రైతు సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



నీటిని విడుదల చేస్తున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): రైతుల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పని చేస్తుందని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని తపాస్‌పల్లి రిజర్వాయర్‌లో నీటిని పార్టీ కార్యకర్తలతో కలసి గురువారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తపాస్‌పల్లి ఎత్తయిన ప్రాంతంలో ఉందని, ఈ ప్రాంతానికి తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే రిజర్వాయర్ నిర్మించినట్లు గుర్తు చేశారు. ప్రస్తుత వర్షాబావ పరిస్థితులలో ఈ ప్రాంత రైతులకు రిజర్వాయర్ నీటిని విడుదలచేసి పంటలు ఎండిపోకుండా భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించాలని, గ్రామాల అభివృద్ధికి ప్రజల కోసం పనిచేస్తామని హామీ ఇచ్చారు. కొమురవెల్లి, చేర్యాల, మద్దూరు, దూల్మిట్ట మండలాల అధ్యులు, నాయకులు, ప్రజాప్రతి నిధులు పాల్గొన్నారు.

‘ఆల్బెండజోల్’తో నులిపురుగుల నివారణ

గజ్వేల్‌రూరల్/బెజ్జంకి(సిద్దిపేట): పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయడంద్వారా నులిపురుగులను నివారించవచ్చని శ్రీగిరిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బల్వీర్‌సింగ్ చెప్పారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా గురువారం గజ్వేల్ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడుపులో నులిపురుగులు ఉండడం వల్ల ఆకలి కాకపోవడం, కడుపులో నొప్పి, రక్తహీనత లాంటి లక్షణాలతో పిల్లలు బాధపడతారన్నారు. యేడాది వయసున్న పిల్లల నుంచి 19 యేళ్లలోపు వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలను తప్పనిసరిగా వేయించాలని సూచించారు. 11న అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో పిల్లలందరికీ ఈ మాత్రల పంపిణీ ఉంటుందని చెప్పారు. ఎంపీడీఓ ప్రవీణ్, తహసీల్దార్ శ్రవణ్‌కుమార్, అహ్మదీపూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రణయ్‌రాజ్, ఐసీడీఎస్ సీడీపీఓ సరిత, సీహెచ్‌ఓ ఖాసీం, ఎంపీహెచ్‌ఓ సత్యనారాయణరెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. అలాగే బెజ్జంకి మండల పరిషత్ కార్యాలంలో ఎంపీడీఓ ప్రవీణ్ మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలు, విద్యాలయాల్లో విద్యార్థులకు కార్యక్రమాలు చేపట్టి మాత్రలు అందజేయాలన్నారు. సమావేశంలో వైద్యాధికారి మాధురి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాణి, ఎంఈఓ మహతిలక్ష్మి, హెచ్ఎంలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే చర్యలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే చర్యలు తప్పవని ఏఓ వసంతరావు హెచ్చరించారు. మండల కేంద్రంలోని పెట్రోలు పంపులు, పాల కేంద్రాలు, ఎరువుల దుకాణాలు, పాతర గడ్డి యూనిట్‌లో ఎస్‌ఐ కృష్ణరెడ్డి, తహసీల్దార్ నిర్మలతో కలిసి గురువారం దాడులు నిర్వహించారు.

◆ ఫిర్యాదు చేయాలి: ఏసీపీ

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి ఆలయ పరిసరాలలో ఎవరైన అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఏసీపీ సదానందం సూచించారు. ఆలయ పరిసరాలలో స్థానిక పోలీసులతో కలసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వసతి గదులు అద్దెకిచ్చే వారు తప్పకుండా ఆధార్ జిరాక్స్ తీసుకోవాలన్నారు.

◆ బీస్మాట్ జిల్లా నూతన కార్యవర్గం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బడ్జెట్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ(బీస్మాట్) జిల్లా నూతన కార్యవర్గాన్ని జిల్లా కేంద్రంలో గురువారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగ్గ మల్లారెడ్డిని ఆరోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శి, కోశాధికారులుగా దాచవరం సంతోష్ కుమార్, గనగోని శ్రీకాంత్ గౌడ్, ఉపాధ్యక్షులుగా మహమ్మద్ సికిందర్, గంగర వేణు, రవి, సంయుక్త కార్యదర్శిగా సురేందర్ రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎజాస్ అలీ, రవీందర్‌రెడ్డి, గౌరవ సలహాదారులుగా చింతాకుల సత్యం, వడ్డేపల్లి బాలకృష్ణ, వెంకటయ్య, మహమ్మద్ అజీముద్దీన్, కార్యవర్గ సభ్యులుగా మామిడాల వెంకటేష్, స్వామి దాస్‌లను ఎన్నుకున్నారు.

◆ దశల వారీగా కొనుగోలు చేయండి

దుబ్బాకటౌన్: రైతులు ఒకేసారి పంట మొత్తానికి యూరియా కొనుగోలు చేయడం ద్వారా కొరత ఏర్పడుతుందని, దశల వారీగా కొనుగోలు చేయాలని దుబ్బాక ఏడీఏ మల్లయ్య సూచించారు. దుబ్బాకలోని ఎరువులు, విత్తనాల దుకాణాలను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీ ధరలకంటే అధికంగా విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్‌తో అధిక లాభాలు

- ఎకరాకు రూ.1.50 లక్షల ఆదాయం

హుస్నాబాద్‌రూరల్: రైతులు ఆయిల్‌పామ్ సాగుచేసి అధిక లాభాలు పొందాలని ఆయిల్‌ఫెడ్ జిల్లా చైర్మన్ భాస్కర్‌రెడ్డి సూచించారు. బంజేరుపల్లిలో రైతులకు ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో గురువారం ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాధారణ పంటల సాగు కంటే ఆయిల్ పామ్ సాగుచేస్తే పెట్టుబడి తగ్గుతుందన్నారు. పంటను ఒక్కసారి సాగుచేస్తే 30 యేళ్ల వరకు దిగుబడులు వస్తున్నాయని చెప్పారు. జిల్లాలో ఇద్దరు రైతులు 15 రోజులకు 9 టన్నుల దిగుబడులు సాధిస్తున్నారని, ఎకరాకు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఆదాయం పొందవచ్చన్నారు. ప్రభుత్వం సబ్సిడీపై డ్రిప్ పరికరాలు అందజేస్తుందని, మూడేళ్లపాటు నెలకు రూ.4,200లు నిర్వహణ ఖర్చులు అందిస్తుందని చెప్పారు. ఉద్యానవనశాఖ అధికారి బాలాజీ, రైతులు పాల్గొన్నారు.

ప్రత్యేక న్యాయమూర్తిగా రాజశేఖర్ నియామకం

హుస్నాబాద్: హుస్నాబాద్ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తిగా రాజశేఖర్‌రెడ్డి నియమితులయ్యారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి గురువారం నియామక పత్రం అందజేశారు. సామాన్య ప్రజలకు న్యాయం, చట్టాల గురించి అవగాహన కల్పించడానికి కృషిచేస్తామనని రాజశేఖర్ అన్నారు.



నియామక పత్రం అందుకుంటున్న రాజశేఖర్‌రెడ్డి

బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేష్ఠం

సీడీపీఓ రమాదేవి



చేర్యాలలో మాట్లాడుతున్న రమాదేవి, కనకరాజు

చేర్యాల(సిద్దిపేట): పుట్టిన బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు ఇవ్వడం ఎంతో శ్రేష్ఠమని సీడీపీఓ రమాదేవి అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణ కేంద్రంలోని పోచమ్మ వీధి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు పట్టించాలన్నారు. దాని వల్ల బిడ్డకు కావల్సిన అన్ని పోషకాలు లభిస్తాయని చెప్పారు. అలాగే బిడ్డకు ఆరు నెలల వయస్సు వచ్చే వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, 7వ నెల నుంచి రెండేళ్ల వరకు తల్లిపాలతో పాటు అనుబంధ పోషకాహారం అందించాలని సూచించారు. పోషణ అభియాన్ బ్లాక్ కో-ఆర్డినేటర్ కనకరాజు మాట్లాడుతూ ఒక బిడ్డ జీవితం ఆరోగ్యంగా ఉండాలంటే మొదటి వెయ్యి రోజులు ఎంతో ముఖ్యం అన్నారు. తల్లీబిడ్డల ఆరోగ్యం కోసం అంగన్‌వాడీ కేంద్రంలో అందించే ఒక పూట పౌష్టికాహారాన్ని అర్హులందరూ తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. అనంతరం సామూహిక సీమంతాలు, అన్నప్రాసన, అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ నాగమణి, హెల్త్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

రోగనిరోధక శక్తి పెరుగుతుంది

గజ్వేల్‌రూరల్: బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు తాగించడం వల్ల బిడ్డకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని అంగన్‌వాడీ టీచర్లు విజయ, నారాయణమ్మ చెప్పారు. పట్టణంలోని 1వ అంగన్‌వాడీ కేంద్రం, ఆర్‌అండ్‌ఆర్ కాలనీ(పల్లెపహాడ్)లోని అంగన్‌వాడీ కేంద్రాలలో గురువారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేర్వేరుగా నిర్వహించిన కార్యక్రమాలలో వారు మాట్లాడుతూ బిడ్డ పుట్టిన ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే తాగించాలని, అందువల్ల బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తల్లిపాలే మొదటి వ్యాక్సిన్

సిద్దిపేటకమాన్: తల్లిపాలే శిశువుకు మొదటి వ్యాక్సిన్‌లా పనిచేస్తాయని, వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయని ప్రభుత్వ మెడికల్ కళాశాల డైరెక్టర్ విమలథామస్ అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తల్లిపాల ప్రాముఖ్యతపై వైద్యులు, సిబ్బంది తల్లులు, గర్భిణులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంగీత, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ చందర్, వైద్యులు సురేశ్ బాబు, జ్యోతి, శ్రావణి, సదానందం తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల పునరుద్ధరణతో గ్రామాలు సుభిక్షం

రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ స్థపతి నాయకం

దుబ్బాక: ఆలయాల పునరుద్ధరణతోనే గ్రామాలు సుభిక్షంగా ఉంటాయని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ స్థపతి వల్లి నాయకం అన్నారు. పట్టణంలో పోచమ్మ ఆలయం పునరుద్ధరణలో భాగంగా గురువారం ఆలయాన్ని సందర్శించారు. అనంతరం కాశీ విశ్వనాథస్వామిని దర్శించుకొన్నారు. అనంతరం బొడ్రాయి పునరుద్ధరణకు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుబ్బాకలో ఆలయాల నిర్మాణం చేపట్టడంపై సంతోషం వ్యక్తం చేశారు. పోచమ్మ ఆలయ పునరుద్ధరణ కమిటీ, కాశీవిశ్వనాథ కమిటీ, వివిధ కుల సంఘాల పెద్దలు, పురోహితులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు అండగా ఉంటాం

- ఎమ్మెల్సీ అంజిరెడ్డి, డాక్టర్ యాదవరెడ్డి
- గజ్వేల్‌లో చేనేత మగ్గం విగ్రహావిష్కరణ



గజ్వేల్‌లో చేనేత మగ్గం విగ్రహావిష్కరణలో పాల్గొన్న అంజిరెడ్డి తదితరులు

గజ్వేల్: చేనేత కార్మికులకు అండగా ఉంటామని పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఢిల్లీవాలా హోటల్ వద్ద ప్రధాన రహదారిపై పద్మశాలి సంఘం, యువజన సంఘం ఆధ్వర్యంలో గురువారం చేనేత మగ్గం విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్సీలు వేర్వురుగా పాల్గొని ప్రసంగించారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత మగ్గం విగ్రహానికి ఆవిష్కరించడం అభినందనీయమని కొనియడారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్, పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్, గౌరవ అధ్యక్షుడు బూర మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో..



సిద్దిపేటలో వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థిని సన్మానిస్తున్న కలెక్టర్ హైమావతి

కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వ్యాసరచన, ఉపన్యాస పోటీలలో ప్రతిభ చాటిన విద్యార్థులను కలెక్టర్ హైమావతి సత్కరించారు.

నేత కార్మికులను ఆదుకోవాలి

హుస్నాబాద్: ప్రభుత్వం చేనేత కార్మికులకు పని కల్పించి ఆదుకోవాలని చేనేత ఐక్య వేదిక బాధ్యులు కోరారు. పట్టణంలోని పద్మశాలి కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు కేక్ కట్‌చేసి పంచుకొన్నారు. అనంతరం పలువురు చేనేత కార్మికులను సన్మానించారు. నాయకులు భగవాన్, నాగభూషణం, శ్రీనివాస్, వెంకటేశం, రాజమల్లు, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

చేనేత పరిరక్షణకు కృషి చేయాలి

జగదేవ్‌పూర్(గజ్వేల్): చేనేతరంగ పరిరక్షణ కోసం ప్రభుత్వం కృషి చేయాలని శ్రీరామకోటి భక్త సమాజం సేవా సంస్థ వ్యవస్థాపకుడు రామకోటి రామరాజు అన్నారు. మండలంలోని తిమ్మాపూర్ మార్కండేయ దేవాలయంలో నేతన్నలను చేనేత వస్త్రాలతో సన్మానించారు. ఉప్పలయ్య, సిద్దిరాములు, కనకయ్య, కిష్టయ్య, సత్యనారాయణ, పోచయ్య, బాలరాజు, కుమార్, యాదగిరి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాకలో..

దుబ్బాకటౌన్: జాతీయ చేనేత దినోత్సవాన్ని దుబ్బాకలో ఘనంగా జరుపుకున్నారు. బీజేపీ దుబ్బాక మున్సిపల్‌శాఖ ఆధ్వర్యంలో చేనేత కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కీర్తిరాజు, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్, రాష్ట్ర చేనేత సెల్ కన్వీనర్ భాస్కర్, నాయకులు రమణారెడ్డి, భరత్ తదితరులు పాల్గొన్నారు.